క్లుప్తంగా

ఆర్థిక సాయం



బాధితుడు నవీన్‌కు సాయం అందజేస్తున్న అన్నపూర్ణ

సఖినేటిపల్లి: గ్రామ శివారు మొక్కతోట ఏరియాకు చెందిన ప్రమాద బాధితుడు మేడిద నవీన్‌కు ఖతార్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ గురువారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నవీన్ ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు పై మొత్తాన్ని శశికిరణ్ తల్లి జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ చేతుల మీదుగా నవీన్‌కు ఇచ్చారు. దొండపాటి పూర్ణప్రకాష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వీల్‌చైర్, నిత్యావసర సరకుల పంపిణీ



వీల్‌చైర్, నిత్యావసర వస్తువులు అందిస్తున్న కృతి ఫౌండేషన్ సభ్యులు

అంబాజీపేట: మాచవరం మెట్లకాలనీకి చెందిన నెల్లి బాలమురళీకృష్ణకు కాకినాడకు చెందిన కృతి ఫౌండేషన్ వీల్‌చైర్, నిత్యావసర సరకులను గురువారం పంపిణీ చేశారు. బాలమురళీ కృష్ణ గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉండడంతో సాయం అందించినట్టు ఫౌండేషన్ వారు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండర్ వెంకటఅశ్విని, వి.సత్యశివ, కుసుమరెడ్డి రత్నం, పాలమూరి వెంకట్, వీరిన గోపాలం పాల్గొన్నారు.

మండలస్థాయి కవితల పోటీలు

ఆలమూరు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీమతి అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహిస్తున్న బాలమందిరం ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఉగాది కవితల పోటీలు నిర్వహించనున్నట్టు వ్యవస్థాపకులు కృష్ణశ్రీ తెలిపారు. సంధిపూడిలో ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు అంగర శ్రీనివాసు అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణశ్రీ పాల్గొని ప్రసంగించారు. విశ్వావసు–విశ్వశాంతి అనే అంశంపై ఈ కవితల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన కవులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కవులు, రచయితలను ఉగాది రోజున గ్రామంలో జరిగే ఉగాది ఉత్సవాలలో ఘనంగా సత్కరిస్తామన్నారు. కవిత, పద్యం, గేయం ఈ మూడు ప్రక్రియల్లో విశ్వశాంతి అంశంపై మాత్రమే రచించిన కవితలను 9963163136 నంబరుకు ఈనెల 27వ తేదీలోపు పంపించాలని ఆయన కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

అంబాజీపేట: అతివేగం, నిర్లక్ష్యం కారణంగా గురువారం అర్ధరాత్రి సమయంలో లారీ రోడ్డు పక్కను ఉన్న విద్యుత్ స్తంభాన్ని, శ్రీకృష్ణుడి ఆలయ మెట్లను ఢీ కొట్టడంతో ధ్వంసమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అంబాజీపేట శివారు స్త్రీల ఆస్పత్రి సమీపంలో దొమ్మేటివారిపాలెం వద్ద రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని లారీ బలంగా ఢీ కొట్టడంతో స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. అక్కడే ఉన్న శ్రీకృష్ణుడు ఆలయ ప్రాంగణంలో ఉన్న చేతి పంపు, మెట్లను ఢీ కొట్టడంతో ధ్వంసమయ్యాయి. అలాగే ఆలయం వద్ద పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

ఇళ్ల స్థలాలు ఆశ చూపి నగదు వసూలు

రావులపాలెం: స్థానిక కొత్త కాలనీలో కొంత మందికి ఇళ్ల స్థలాలు ఆశ చూపి పలువురు వారు వద్ద నుంచి నగదు వసూలు చేయడంతో పాటు చివరికి స్థలాలు ఇవ్వకుండా మోసం చేశారని పలువురు స్థానిక ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులకు కూడా ఫిర్యాదులు అందడంతో ఈ ఘటన వెలుగు చూసింది. కొత్త కాలనీలో గతంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వగా ఇళ్లు నిర్మించుకోనే వారు వద్ద నుంచి కొన్ని స్థలాలు వెనుకకు తీసుకుని వాటిని కొత్తవారికి మంజూరు అయ్యేలా చేస్తామని దీనికోసం రెండు సెంట్లు భూమికి రూ. 1,50,000 ఇవ్వాలని సుమారు 7 నెలల క్రితం ఈతకోట గ్రామానికి చెందిన యర్రయ్య రావులపానికి చెందిన భరత్, శివప్రసాద్ అనే వ్యక్తులు కొంత మంది వద్ద నుంచి కొంత నగదు తీసుకున్నారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే వీరిలో యర్రయ్య అనే వ్యక్తి ఇటీవల కాలంలో మృతి చెందడంతో, మిగిలిన భరత్, శివప్రసాదు స్థానిక గృహ నిర్మాణ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తికి సన్నిహితులు కావడంతో గృహ నిర్మాణ శాఖ అధికారుల ప్రమేయం ఈ ఘటనలో ఉందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై గృహ నిర్మాణాల శాఖ ఏఈ జేజీబాబును వివరణ కోరగా ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారని నగదు వసూలుకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఇటువంటి సంబంధం లేదని ఆయన తెలిపారు.

నిధులున్నా.. పనులు చేపట్టరే?

- అధ్వానంగా మోరి డ్రైన్
- ఆక్రమణలు, చెత్తతో పూడుకుపోయిన వైనం
- వర్షా కాలంలో ముంపు బారిన రెండు గ్రామాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఏడాది క్రితం నిధులు మంజూరు
- ఎన్నికల వల్ల అప్పట్లో పనులకు అంతరాయం
- పట్టించుకోని అధికారులు



ఉయ్యూరువారి మెరక గ్రామ పరిధిలో అధ్వానంగా ఉన్న డ్రైన్



మోరి గ్రామ పరిధిలో శివాలయం, ఇళ్ల మధ్య డ్రైన్‌లో వేసిన ఇసుక మేట

సఖినేటిపల్లి: వర్షాలు వస్తే ఆ రెండు గ్రామాలకు ముంపు తప్పడంలేదు. ఆ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న డ్రైన్ పొంగిపొర్లడంతో పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. మండల పరిధిలోని మోరి, ఉయ్యూరువారి మెరక గ్రామాల మధ్య పూర్వ కాలంలో ఏర్పాటు చేసిన మోరి డ్రైన్ మరమ్మతులకు ఏడాది క్రితం మంజూరైన నిధులు సార్థకతకు ప్రస్తుత పాలకులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు రెండు నెలలు ముందు ఎన్ఆర్‌జీఎస్ పథకంలో రూ.86 లక్షలు మంజూరయ్యాయి. పనులకు శంకుస్థాపన కూడా అప్పటి పాలకులు చేశారు. తర్వాత ఎన్నికలు రావడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ఈ వేసవిలోనైనా ఆ పనులు చేపట్టాలని మురుగునీటి సమస్యలను నుంచి గట్టెక్కించాలని మోరి, ఉయ్యూరు గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రెండు కిలోమీటర్ల మేర డ్రైన్

మోరి, ఉయ్యూరు గ్రామాలను కలుపుతూ సుమారు రెండు కిలోమీటర్ల మేర డ్రైన్ విస్తరించి ఉంది. డ్రైన్ పొడవునా చాలా చోట్ల ఆక్రమణలు ఉండడంతో కుచించుకుపోయింది. అలాగే కొన్నిచోట్ల పూడుకుపోయి రూపురేఖలు లేకుండా పోయాయి. గతంలో డ్రైన్‌కు రెండు గ్రామ పంచాయతీలు కొంత మేర మరమ్మతులు చేపట్టాయి. అయితే పూర్తిస్థాయిలో ఏకకాలంలో పనులు జరగకపోవడం పెద్ద సమస్యగా మారింది. డ్రైన్‌లో వేస్తున్న ఇసుక మేటలకు మురుగునీటి ప్రవాహం ముందుకు వెళ్లే మార్గం లేక డ్రైన్ నిరీర్యంగా మారింది.

మూసుకుపోయిన అవుట్‌లెట్

పూర్వం నుంచి డ్రైన్‌కు మొండికోదు ఛానల్‌లోకి ఉన్న అవుట్‌లెట్ దారి అంతా పిచ్చి మొక్కలతో పూర్తిగా మూసుకుపోయి అధ్వానంగా మారింది. దీంతో ఛానల్‌లోకి మురుగునీరు దిగడానికి ఆటంకంగా ఉంది. అంతేకాక భారీ వర్షాల సమయాల్లో అవుట్‌లెట్ వద్ద సైఫన్ లేకపోవడంతో ఛానల్‌లోకి దిగాల్సిన మురుగు నీటికి వర్షం నీరు తోడై వెనక్కి పోటెత్తి పల్లపు ప్రాంతాలను ముంచేస్తోంది.

పోటెత్తుతున్న మురుగునీరు

డ్రైన్‌లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్న తరుణంలో డ్రైన్‌ను ఆనుకుని ఉన్న ఎంతో ప్రాధాన్యత ఉన్న పలు ఏరియాలకు మురుగునీరు పోటెత్తుతోంది. ప్రధానంగా డ్రైన్‌ను ఆనుకుని మోరి శివాలయం ఆవరణలోకి, అంగన్‌వాడీ సెంటర్, జెడ్పీ హైస్కూల్, నివాస గృహాలు ఏరియాలలో మురుగునీరు చేరుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపయోగపడని తూరల కల్వర్టు

మోరి ప్రధాన రహదారిలో డ్రైన్‌కు శిథిల స్థితికి చేరుకున్న సిమెంటు తూరలు స్థానే గతంలో మళ్లీ కొత్తవి ఏర్పాటు చేశారు. అయితే కల్వర్టు వద్ద తూరలలో ఇసుక చేరడంతో నీటి ప్రవాహం నిలిచింది. చెత్తా చెదారం పేరుకుపోవడంతో తూరల వద్ద మార్గం మూసుకుపోయింది. తూరల కల్వర్టుకు ప్రత్యామ్నాయంగా శ్లాబ్ కల్వర్టు నిర్మిస్తేనే నీటి ప్రవాహానికి ఆటంకం లేకుంటా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

వేసవిలో పనులు చేస్తేనే..



డ్రెయిన్ పొడవునా మరమ్మతులు ఏకకాలంలో చేపట్టాలి. దశల వారీగా చేపట్టిన పనులు వల్ల ఉపయోగం లేదు. ప్రస్తుత వేసవి సీజన్‌లో పనులు చేపడితే రెండు గ్రామాల ప్రజలకు మేలు చేకూరుతుంది. లేదంటే వర్షా కాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

– బూశిం చినబాబూరావు, ఉపసర్పంచ్, మోరి

శాశ్వత పరిష్కారం చూపాలి



మోరి, వీవీ మెరక గ్రామాలకు మురుగునీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. పనులు జాప్యం వల్ల వర్షాకాలంలో డ్రైన్ పొంగి ప్రవహించడంతో సమీప ప్రధాన ఏరియాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ ఏడాదైనా సమస్యను పరిష్కరించాలి.

– అయిలూరి కామేశ్వరరావు, గ్రామస్తుడు, మోరి

కష్టపడి నిధులు తెచ్చుకున్నాం



డ్రైన్ మరమ్మతులకు గత ప్రభుత్వ హయాంలో ఎంతో కష్టపడి ఉపాధి హామీ పథకంలో రూ.86 లక్షలు తెచ్చుకున్నాం. రెండు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఈ డ్రైన్‌కు మరమ్మతులు చేపడితే ఎంతో మేలు జరుగుతుంది. ఏడాది క్రితం తెచ్చుకున్న నిధులు ఎన్నికల కోడ్ వల్ల ఖర్చు కాలేదు. నిధులు వినియోగంపై ప్రస్తుత పాలకులు దృష్టి పెట్టాలి.

– పసలపూడి లక్ష్మీ పద్మ మంగతాయారు, సర్పంచ్, మోరి

లోకల్ డ్రెయిన్‌గా పరిగణించాలి

మోరి డ్రైన్‌ను లోకల్ డ్రైన్‌గానే పరిగణించాలి. డ్రైన్ నిర్వహణ పంచాయతీల ఆధీనంలో ఉంటుంది. తమ శాఖ పరిధిలో లేదు.

– రేష్మ, డ్రైన్స్ ఏఈ, రాజోలు

ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో పోరాటం



పాశర్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాశర్లపూడిలో మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు స్వగృహం వద్ద గురువారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షతన మండల కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తున్నామని శ్రీనివాసరావు చెప్పారు. పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా ఉత్సాహంగా పని చేసే యువతకు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల్లో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేసే దిశగా సమాయత్తం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నేతలు తోరం భాస్కర్, తులా గోపాలకృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు, బొరుసు నర్సింహమూర్తి, చిక్కం బుజ్జిబాబు, మట్టపర్తి శివ, జోగి రామకృష్ణ, విప్పర్తి నాగేశ్వరరావు, బాలం రమేష్, యల్లమెల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన నాయకులు



తాడేపల్లిలో వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యమోహన్



వైఎస్ జగన్‌ను శాలువాతో సత్కరించిన కేఎస్ఎన్ రాజు

అంబాజీపేట: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ గురువారం మర్యాదపూరకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

మలికిపురం: రాజోలు నియోజక వర్గం మలికిపురానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా సీనియర్ నాయకులు కేఎస్ఎన్ రాజు గురువారం మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్‌ను కలుసుకొని శాలువాతో సత్కరించారు. గత ఎన్నికల అనంతరం జిల్లాతో పాటు రాజోలు నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించినట్టు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఆర్డీఓ శ్రీకర్
- సంక్షేమ వసతి గృహాలు ఆకస్మిక తనిఖీ



కొత్తపేట బాలికల హాస్టల్‌లో విద్యార్థినుల సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఆర్డీఓ శ్రీకర్

కొత్తపేట: తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ప్రతి తరగతిలో ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధిస్తూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆర్‌డీఓ పి.శ్రీకర్ ఉద్బోధించారు. కొత్తపేటలో సాంఘిక సంక్షేమ బాలురు, బాలికల వసతి గృహాలను గురువారం మధ్యాహ్నం ఆర్డీఓ శ్రీకర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వసతి గృహాలలో అల్పాహారం, భోజనం, ఇతర సదుపాయాలు ఎలా ఉంటున్నాయి? హాస్టల్ వసతి సౌకర్యంగానే ఉంటుందా? ఇబ్బందులేమైనా ఉన్నాయా? తదితర అంశాలను ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై హాస్టల్ వార్డెన్స్ పవన్‌కుమార్, హేమలతలను ఆరా తీశారు. హాస్టల్ విద్యార్థులకు ఏవిధమైన లోటుపాట్లు లేకుండా సంరక్షించుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ఆధునీకరణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. బాలికల వసతి గృహం గేటు ఎదురుగా చెత్తతో ఉన్న ప్రదేశాన్ని వెంటనే శుభ్రం చేయించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ వై.రాంబాబు, ఆర్‌ఐ పీ రవిశంకర్ ఉన్నారు.

సమావేశ హాల్లోకి వచ్చేందుకు మీ అర్హతేంటీ?

మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుబ్రహ్మణ్యేశ్వరరావును ప్రశ్నించిన ఎంపీపీ



సమావేశపు హాల్లోకి చొచ్చుకు వచ్చిన ఎంపీపీ, ఎంపీడీఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరావు

అయినవిల్లి: మండల బడ్జెట్ సమావేశపు హాల్లోకి ఎమ్మెల్యే, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, నీటి సంఘం చైర్మన్లు, అధికారులకు వచ్చే అర్హత ఉందని మాజీ ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు అర్హత లేదని ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అన్నారు. మీకే అర్హత ఉందని బడ్జెట్ సమావేశపు హాల్లోకి వచ్చారంటూ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, మాజీ ఏఎంసీ చైర్మన్, సీనియర్ టీడీపీ నాయకుడు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావును ఎంపీపీ సూటిగా ప్రశ్నించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, ఎంపీడీఓ జి.భీమారావు సమీక్షించారు. ఈ సమీక్షలో అధికారులకు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలు ఏకరువు పెట్టారు. సత్వరం పరిష్కారం చూపిస్తామని అధికారులు సమాధానం ఇచ్చారు. అనంతరం బడ్జెట్‌ను సమావేశంలో తీర్మానించగా, అందుకు సభ్యులు తమ ఆమోదాన్ని తెలిపారు. ఈ సమయంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, టీటీపీ సీనియర్ నాయకులు మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు సమావేశపు హాల్లోకి చొచ్చుకు వచ్చారు. తన భార్య మద్దాల విజయలక్ష్మి తొత్తరమూడి–1లో ఎంపీటీసీగా పోటీ చేసి గెలిచిందని ఆ హోదాలో బడ్జెట్ సమావేశపు హాల్లోకి వచ్చి తాను ఎంపీడీఓను, ఎంపీపీని ప్రశ్నిస్తున్నానన్నారు. బడ్జెట్ సమావేశమా?, సర్వసభ్య సమావేశామా? ఎంపీడీఓను ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశంలో ప్రజా ప్రతినిధులకు బడ్జెట్‌కు సంబంధించిన ప్రతులను ఇవ్వాలని ఎంపీడీఓ, ఎంపీపీపై ఆగ్రహించారు. ఇందుకు ఎంపీపీ స్పందిస్తు మీకు సమావేశపు హాల్లోకి రావాడాకి ఏ విధమైన హక్కు లేదని, వచ్చి ఇలా రెచ్చిపోయి మాట్లాడడం సమాజసం కాదన్నారు. దీంతో మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు తాను గతంలో జెడ్పీటీసీగా పని చేశానని నాకు నిబంధనలు తెలుసని ఆగ్రహంతో కేకలు వేసుకుంటు సమావేశపు హాల్లో నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో సమావేశం యథావిధిగా జరిగింది. సమావేశంలో సభ్యుడు, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహరా, ఎస్సై శాస్త్రి తదితరులు ఉన్నారు.

‘అనగనగా ఆస్ట్రేలియాలో’.. సినిమా సంబరాలు



రాజోలులో ‘అనగనగా ఆస్ట్రేలియాలో..’ సినిమా సంబరాలు

రాజోలు: ఆస్ట్రేలియాలో జరిగిన యాదార్థ సంఘటనను తెరకెక్కించిన రాజోలు నాగార్జునా స్ట్రీట్‌కు చెందిన బొక్కా తారక రామారావు దర్శకత్వంలో నిర్మించిన ‘అనగనగా ఆస్ట్రేలియాలో..’ సినిమా విజయవంతం కావాలని గురువారం రాజోలులో సంబరాలు నిర్వహించారు. నాగార్జునా స్ట్రీట్ బాలబాలజీ సంఘం సభ్యులు స్థానిక పీఆర్ మార్ట్ వద్ద కేక్ కట్ చేసి సంబారాలు నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా సినిమా విడుదలైన సందర్భంగా సినిమా విజయవంతం కావాలని కోరుతూ పలు ఆలయాల్లో పూజలు చేశారు. బీసీ సంఘ నాయకుడు గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ రాజోలులో పుట్టి పెరిగి ఉద్యోగ రీత్యా ఆస్ట్రేలియాలో స్థిరపడిన తారక రామారావు సహన క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారన్నారు. ఈ సందర్భంగా తారక రామారావు రిటైర్డ్ నీటిపారుదల శాఖ ఉద్యోగి అయిన బొక్కా సత్యనారాయణను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. సంఘ నాయకులు చిట్టూరి అప్పారావు, చెల్లుబోయిన పరమేష్, ఇళ్ల నాని, అప్పారి గుణ, మొల్లేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీకి ఘన స్వాగతం

రాజోలు: కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం(సీఐఎస్ఎఫ్) వ్యవస్థాపక వేడుకల్లో భాగంగా పశ్చిమబెంగాల్ నుంచి కన్యాకుమారి వరకు సీఐఎస్ఎఫ్ దళాలు చేపట్టిన సైక్లోదాన్ సైకిల్ యాత్రకు గురువారం రాజోలులో ఘన స్వాగతం పలికారు. రాజోలు డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సైకిల్‌యాత్రలో పాల్గొన్న సీఐఎస్ఎఫ్ దళ సభ్యులకు కళాశాలలో అల్పాహారం ఏర్పాటు చేశారు. డిప్యూటీ కమాండర్ వి.కె.ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం, మాదక ద్రవ్యాలు, ప్రేలుడు పదార్థాలు, అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ‘సురక్షిత తీరాలు–సంపన్న దేశం’ అనే నినాదంతో యాత్ర కొనసాగుతుందన్నారు. సైకిల్ యాత్రలో 50 మంది సభ్యులు ఉన్నారని వారిలో 8 మంది మహిళల కూడా ఉన్నారన్నారు. అసిస్టెంట్ కమాండర్ సప్తపది, పీఆర్వో నల్లి రాజు, ఎస్ఎస్ఎస్ పీఓ కృష్ణమూర్తి, వరప్రసాద్, పీడీ బి.మధుకుమార్, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను నిరసిస్తూ ఎమ్మార్వోకు వినతి

మామిడికుదురు: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల మహానాడు నేతలు గురువారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 2011 కుల గణనను ప్రాతిపదికగా తీసుకుని ఎస్సీ వర్గీకరణ చేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. 2024–25 ఎస్సీ జనాభాను ప్రాతిపదికగా తీసుకుని వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర క్యాబినేట్ తీసుకున్న నిర్ణయం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంటులో చర్చ జరిపి చట్ట ప్రకారం చూడాలన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్‌తో చర్చించి, వారి ఆమోదం కూడా తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా వర్గీకరణ చేస్తామని మేనిఫెస్టోలో చెప్పిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎమ్మార్వో సుబ్రహ్మణ్యం ఆచార్యులుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ నిరసనలో జిల్లా మాల మహానాడు అధ్యక్షులు బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు, మండల మాలల న్యాయ పోరాట సమితి అధ్యక్షులు మట్టా సత్తిబాబు, పిల్లి శ్రీనివాస్, నీతిపూడి మహేష్, బత్తుల శేఖర్, విప్పర్తి రెడ్డి, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా చేద్దాం

కొత్తపేట: అన్ని గ్రామాలు సారా రహిత గ్రామాలు కావాలని, అందుకు ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) వీ రేణుక కోరారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండల పరిధిలోని వెలిచేరు, రాజవరం, పేరవరం గ్రామాలను కొత్తపేట ఎక్సైజ్ ఎస్సై కే అన్నవరం దత్తత తీసుకున్నారు. ఆయా విస్తృతంగా దాడులు నిర్వహించారు. సారా తయారు, విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. అన్ని గ్రామాను సారా రహిత గ్రామాలుగా మార్చే క్రమంలో గురువారం రాజవరం గ్రామ పంచాయతీ వద్ద డ్వాక్రా సంఘాలకు, మహిళా సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ జాన మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎక్సైజ్ ఏసీ రేణుక, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ పాల్గొన్నారు. కొత్తపేట ఎక్సైజ్ సీఐ కే కాత్యాయని, ఎస్సై కే అన్నవరం తధితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం

మలికిపురం: పేద ప్రజల అభివృద్ధికి ప్రాణ త్యాగం చేసిన రాజోలు నియోజకవర్గ అమరవీరులు కందికట్ల నాగభూషణం, అల్లూరి బుచ్చిరామరాజు, రాపాక సూర్యనారాయణ, జి.వెంకటరెడ్డి, దొంగ నరసింహమూర్తి గుబ్బల వెంకటరెడ్డి లాంటి వీరులను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు కృషి చేస్తామని సీపీఐ నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం మలికిపురం భూపాతివారిపేటలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద సీపీఐ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా మృత వీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చెల్లుబోయిన. కేశవశెట్టి, తులసీభాస్కర్, ప్రభాకరరావు, బుజ్జిబాబు, సురేషబాబు, గంగాచలం, ఆనంద్, నాగేశ్వరరావు, చిట్టి రాజు, రవిప్రసాద్, భానోజీ, పెయ్యల పండు, రవి పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అంబాజీపేట: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణ సదుపాయం పొందేందుకు బీసీ సామాజిక వర్గాలు, ఈబీసీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ జి.వి.సరోవర్ గురువారం తెలిపారు. బీసీ ఏ, బీ, సీ, డీ, ఈ సామాజిక వర్గాలకు చెందినవారు, ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ తదితర ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారు ఈ నెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల్లో స్వయం ఉపాధి పొందేందుకు అర్హులకు సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ విద్యార్హత ఉన్న నిరుద్యోగులు జనరిక్ ఫార్మసిని నెలకొల్పుకోవచ్చన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన వారు మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ పథకం ద్వారా స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా విభాగాల్లో ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫొటో, మొబైల్ నంబరు తదితర వివరాలతో ఈ సేవా కేంద్రం, సచివాలయాలను సంప్రదించాలన్నారు.

కవిత్వం ఒక సామాజిక ఆశయం కావాలి

సఖినేటిపల్లి: కవిత్వం ఒక సామాజిక ఆశయం కావాలని కవి, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం సఖినేటిపల్లిలో మీడియాతో మాట్లాడారు. సామాజిక స్పృహ కలిగిన కవిత్వం ఎప్పటికీ బతికే ఉంటుందని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కవులను ప్రోత్సహిస్తూ ఇప్పటి వరకూ జాతీయ స్థాయిలో 146 కవి సమ్మేళనాలను నిర్వహించినట్టు చెప్పారు. అలాగే శ్రీశ్రీ కళావేదిక ద్వారా ఇతర రాష్ట్రాలతోపాటు దుబాయ్, కువైట్ దేశాలలో కూడా సాహిత్య కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ 15 కవితా సంకలనాలు, నాలుగు నవలలు, రెండు కథా సంపుటాలు రాసినట్టు ప్రతాప్ పేర్కొన్నారు. ఇటీవల ట్రాన్స్ జెండర్స్‌పై రాసిన పుస్తకం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన భాను తేజాస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, రేవతి హాస్పిటల్, గౌతమీ నేత్రాలయం, రమా దంత వైద్యశాల వైద్యులచే ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, పొట్టకు సంబంధించిన పరీక్షలు, ఎముకలకు సంబంధిచిన పరీక్షలు, కన్ను, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరిగింది. మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి మల్లిడి హరికృష్ణారెడ్డి, ఈఓపీఆర్‌డీ డీ సుబ్బారావు, ఏపీఓ ఎన్ ఆనంద్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, వైద్య సేవలు పొందారు.

పాఠశాలల పరిశీలన

మామిడికుదురు: ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఆ ప్రాజెక్టు సంచాలకులు ముప్వ రామలింగం గురువారం పరిశీలన చేశారు. మామిడికుదురు, పాశర్లపూడి జెడ్పీహెచ్ స్కూళ్లను ఆయన పరిశీలించారు. పదో తరగతి పరీక్షల రాష్ట్ర ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న రామలింగం పదో తరగతి పరీక్షలకు హాస్టల్ విద్యార్థులు ఏ విధంగా సన్నద్ధమవుతున్నారన్న అంశంపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

‘పినాకిల్ శిక్షా అవార్డు’ రావడంపై హర్షం

రాజోలు: జాతీయ స్థాయిలో తాటిపాక నెక్స్‌జెన్ పాఠశాల మొదటి ర్యాంకు సాధించిందని ఆ పాఠశాల డైరెక్టర్ ఎన్.శశి గురువారం తెలిపారు. పాఠశాలల పురోగతి, విలక్షణ విద్యాభివృద్ధి వంటి అంశాలపై సాధించిన విజయాలు, సంస్కరణలను గుర్తించి అవార్డు అందించారన్నారు. జాతీయ స్థాయిలో వర్చువల్‌గా తొమ్మిది వేలకు పైగా పాఠశాలలు పోటీ పడ్డాయన్నారు. అవార్డు రావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పాత బోరు నుంచి ఎగసిపడిన నీరు



పొన్నమండలో బోరు నుంచి ఎగసిపడుతున్న నీరు

రాజోలు: పొన్నమండలో గురువారం ఆక్వా చెరువు వద్ద ఉన్న పాత బోరును పునరుద్ధరణ పనులు నిర్వహిస్తుండగా ఆకస్మాత్తుగా బోరు నుంచి నీరు, మట్టి సుమారు 40 అడుగుల ఎత్తులో ఎగసిపడ్డాయి. దీంతో బోరు పనులు చేస్తున్న కార్మికులు ప్రాణభయంతో పరుగుతు తీశారు. ఎక్కువగా ఈ ప్రాంతంలో ఓఎన్జీసీకి చెందిన గ్యాస్ పైప్‌లైన్లు ఉండడంతో భయాందోళనకు గురయ్యారు. బోరు నుంచి నాలుగు గంటల పాటు నీరు పైకి వచ్చింది. సమాచారం తెలుసుకున్న ఓఎన్జీసీ సిబ్బంది బోరు బావి నుంచి ఎగసిపడుతున్న నీటి వేగాన్ని అదుపు చేసి బోరును పూడ్చే పనులు చేపట్టారు. బోరును పూర్తిగా పూడ్చివేసేందుకు సుమారు ఆరు గంటల సమయం పట్టింది. బోరు బావి నుంచి నీరు, మట్టి ఎగసి పడుతున్న సంఘటనా స్థలాన్ని తహసీల్దారు ప్రసాద్ పరిశీలించారు. బోరు నుంచి ఎలాంటి నీరు, మట్టి, గ్యాస్ రాకుండా పూర్తిగా అదపు చేశారని తహసీల్దారు తెలిపారు. ఆక్వా చెరువుల వద్ద ఉన్న పాతబోర్లు పనులు పునరుద్ధరణ చేస్తే ఓఎన్జీసీ, ఫైర్ శాఖలకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు.